




# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 10

పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

బుధవారం 14 మే 2025


## ఆదంపుర్ ఎయిర్‌బేస్‌కు వెళ్లిన ప్రధాని మోదీ









**న్యూఢిల్లీ, కలంకౌంటర్ :** భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సింధూర్' అనంతరం, పాకిస్థాన్ వైమానిక దళం (పీఏఎఫ్) తమ హైపర్‌సోనిక్ క్షిపణులతో అదంపూర్‌లోని ఎస్-400 వ్యవస్థను ధ్వంసం చేశామని ప్రకటించింది. ఇందుకు సంబంధించిన నకిలీ వీడియోలను కూడా ప్రచారంలో పెట్టింది. ఈ నేపథ్యంలోనే ప్రధాని మోదీ అదంపూర్ వైమానిక స్థావరంలో పర్యటించి, అక్కడి వాయుసేన యోధులతో ముచ్చటించారు. 'ఆపరేషన్ సింధూర్' సమయంలో చురుగ్గా వ్యవహరించిన ఈ వైమానిక స్థావరంపై గత వారం పాకిస్థాన్ దాడికి యత్నించిందని రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించిన సంగతి తెలిసిందే. ప్రధాని పర్యటనకు ముందే, భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ పాకిస్థాన్ సాగిస్తున్న తప్పుడు ప్రచారాన్ని బట్టబయలు చేసింది. ఎస్-400 వ్యవస్థకు, బ్రహ్మోస్ క్షిపణి స్థావరానికి నష్టం కలిగించామన్న పాక్ వాదనలను తీవ్రంగా ఖండించింది.

**ప్రధాని నరేంద్రమోదీ మంగళవారం పంజాబ్‌లోని ఆదంపుర్ ఎయిర్‌బేస్‌ను సందర్శించారు. అక్కడ ఉన్న సైనికులతో మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్, భారత్-పాక్ కాల్పుల విరమణకు అంగీకరించిన నేపథ్యంలో ఆయన పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది.**



## లోతైన అధ్యయనంతోనే రాష్ట్ర ఆదాయంలో పెరుగుదల

- ఈ ఏడాది రూ.1,34,208 కోట్ల ఆదాయం లక్ష్యం
- సాంకేతికత వినియోగంతో పన్ను ఎగవేతలకు చెక్
- ముఖ్యమంత్రి చంద్రబాబు



**అమరావతి,కలంకౌంటర్ :** రాష్ట్ర ఆదాయం మరింతగా పెంచేందుకు ఉన్న అనుకూలతలు, వేగంగా వృద్ధి చెందడానికి గల అవకాశాలపై ఆదాయార్జన శాఖలన్నీ లోతైన అధ్యయనం చేయాలని... అంతిమంగా రాష్ట్ర ఆదాయం భారీఎత్తున పెరిగేలా చూడాలని అధికారులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. గడిచిన 30 ఏళ్ల ఆదాయ ఫలితాలను పరిశీలించి భవిష్యత్ ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ సొంత ఆదాయం పెంచుకునేందుకు ఎలక్ట్రానిక్స్, ఐటీ, సేవల రంగాలు ఎక్కువగా దోహదం చేస్తాయని ముఖ్యమంత్రి అన్నారు. మంగళవారం సచివాలయంలో ఆదాయార్జన శాఖలపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. సమీక్షలో శాఖల వారీ పురోగతిపై చర్చించారు. మరోవైపు బంగారం అత్యధికంగా కొనుగోలు చేస్తున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ముందున్నప్పటికీ... పన్ను ఆదాయం ఆస్థాయిలో ఎందుకు లేదో అధికారులు దృష్టి పెట్టాలని... పన్ను ఎగవేతలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని శాఖల సమాచారంతో డేటా లేక్ ఏర్పాటు చేయాలని... ప్రతిశాఖకు ఏఐ బృందం ఉండాలని ముఖ్యమంత్రి చెప్పారు. పన్ను చెల్లింపుదారులకు ఏఐ టూల్ ద్వారా సేవలు అందించేలా వచ్చే రెండు, మూడు నెలల్లో ఏఐ ఆధారిత పన్నుల వ్యవస్థను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు.

**మద్యం సరఫరా, అమ్మకాల ట్రాకింగ్ :** పొరుగు రాష్ట్రాల నుంచి మద్యం అక్రమంగా రాష్ట్రంలో విక్రయించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో మద్యం విక్రయాలు పారదర్శకంగా జరిగేలా సరఫరా దగ్గర నుంచి అమ్మకం వరకు... ప్రతీది రియల్ టైమ్‌లో ట్రాక్ చేయాలని చెప్పారు. కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల్లో రవాణా శాఖ ఆదాయం పెరుగుతుంటే... ఆంధ్రప్రదేశ్‌లో ఎందుకు తక్కువుగా ఆదాయం వస్తోందని ముఖ్యమంత్రి అధికారులను ప్రశ్నించారు. దీనికి కారణాలు అన్వేషించి వెంటనే, సరైన విధానాలను అవలంభించి ఆదాయం పెరిగేలా చూడాలని చెప్పారు. నెలవారీ లక్ష్యాలను అధిగమించేలా ఆదాయార్జన శాఖలు ప్రయత్నించాలని అన్నారు.

**ఎర్రచందనం నిల్వలపై సమగ్ర అధ్యయనం :** రాష్ట్రంలో ఎర్రచందనం నిల్వలను అంతర్జాతీయ మార్కెట్‌లో విక్రయించేలా కమిటీ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. వేల కోట్ల రూపాయల విలువైన ఎర్రచందనం మన రాష్ట్రానికి మాత్రమే సొంతమని... దీనిని విక్రయించడం ద్వారా పెద్దఎత్తున ఆదాయం ఆర్జించవచ్చున్నారు. రాష్ట్రంలో ఎన్ని టన్నుల ఎర్రచందనం నిల్వలు ఉన్నాయి...వాటి విలువ ఎంత అనేదానిపై కమిటీ స్పష్టమైన నివేదిక ఇవ్వాలని చెప్పారు.

**29 శాతం అధికంగా ఆదాయార్జన లక్ష్యం..** వాణిజ్య పన్నులు, ఎక్సైజ్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, గనులు, అటవీ.. ఇలా అన్ని రకాల ఆదాయాలు కలిపి 2025-26 సంవత్సరానికి రాష్ట్ర సొంత ఆదాయం రూ.1,34,208 కోట్లు

- 2లో

## రష్యా కు రుణపడ్డ భారత్

ప్రపంచం మొత్తం భారత్ వైపు చూసింది.ఏమిటి ఈ త్రివిధ దళాలు సామర్థ్యం ,యుద్ధ నీతి, యుద్ధ వ్యూహం,శత్రువును ఉక్కిరిబిక్కిరి చేసిన తీరు, కాళ్ళ బేరానికి పాకిస్తాన్ రావడం, అమెరికా,చైనా తో సహా షాక్ అయ్యాయంటే భారత్ శక్తి ఏ స్థాయిలో ఉందో అర్థం అవుతోంది.దేశ ప్రయోజనాలు,దేశ ప్రజల రక్షణ తప్ప మరో అజెండా లేదని ప్రపంచానికి స్పష్టం చేసిన ప్రధాని మోదీ నాయకత్వ పటిమకు ప్రశంసలు కురుస్తున్నాయి.శాంతిని కోరుకుంటూనే ,తేడా వస్తే దేనికైనా సిద్ధం అని సందేశం ప్రపంచానికి భారత్ పంపింది. విర్రవీగిన చైనా కు చలి ,జ్వరం వచ్చింది. పాకిస్తాన్ సరెండర్ అయింది. భారత్ ధైర్య సాహసాలను పసిగట్టిన అమెరికా రాకెట్ స్పీడ్ తో స్పందించి పాకిస్తాన్ కు జరగబోయే ప్రమాద పరిణామాలు వివరించి కాళ్ళ బేరానికి వెళ్ళమని సూచించింది.దటీజ్ భారత్.దేశమంతా ప్రధాని మోదీ, త్రివిధ దళాలకు సెల్యూట్ చేశారు. భారత్ కు మంచి మిత్రదేశం రష్యా అని మరోసారి రుజువైంది.ఆయుధాలు సరఫరా చేయడమే కాకుండా టెక్నాలజీ కూడా షేర్ చేస్తుంది అంటే ఎంత నమ్మక మో భారత్ అంటే అర్థం అవుతోంది.సాధారణంగా ఇతర దేశాలకు ఆయుధాలు మాత్రమే విక్రయిస్తుంది. టెక్నాలజీ ఎవరికీ షేర్ చేయదు రష్యా భారత్ కు తప్ప.ఆపరేషన్ సింధూర్ లో రష్యా ఇచ్చిన s_400 శత్రుదేశం పాక్ ను గజ గజ వణికేలా చేసింది. భారత్ పౌరుల ప్రాణాలు కాపాడింది.చైనా నుంచి పాకిస్తాన్ కొనుగోలు చేసిన ఆయుధాలు సైతం అవలీలగా కొట్టేసి భారత్ ముందు బలాదూర్ అని రుజువు చేసింది.ప్రపంచం మొత్తం భారత్ వైపు చూసేలా చేసిన రష్యా కు భారత్ రుణపడి ఉందన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది.ఈ యుద్ధం ద్వారా భారత్ సామర్థ్యం స్పష్టం అవడంతో పాటు రష్యా ఆయుధాలకు డిమాండ్ పెరిగింది.చైనా ఆయుధాల ను దీపావళి బాంబులుగా చూస్తున్న పరిస్థితి నెలకొంది.అందుకే రష్యా అధ్యక్షుడు పుతిన్ ఆనంద డోలికల్లో మునిగిపోయినట్లు నిపుణులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే మరో వైపు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సైతం ఆనందంలో ఉన్నట్లు సమాచారం .ఎందుకంటే ఇప్పటివరకు ప్రపంచంలో అధునాతన టెక్నాలజీ తో ఆయుధాలు కలిగిన ఆయుధాలు ఉన్న దేశంగా,అమెరికాను సైతం మించి ఆయుధ సామర్థ్యం ఉన్నట్లు భావించారు.ఆపరేషన్ సింధూర్ ఫలితంగా చైనా ఆయుధాలను భారత్ పిట్టల్ని కొట్టినట్లు కొట్టిన విషాదం సాక్ష్యాధారాలతో ప్రపంచం చూసింది.ఫలితంగా ట్రంప్ ఆనందంలో మునిగిపోయారని చెబుతున్నారు విశ్లేషకులు. మరో వైపు యుద్ధం తాను జోక్యం చేసుకున్న ఫలితంగానే ఆగింది అని సంబరపడుతున్నారు. ఏది ఏమైనా అటు ట్రంప్,ఇటు పుతిన్ ను ఆనందానికి కారణం భారత్ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వం అని విదేశీ వ్యవహారాల నిపుణులు చెబుతున్నారు.

**-రవికుమార్**










# వీరజవాన్ మురళీ నాయక్ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ సీఎం వైఎస్ జగన్..

-శ్రీ సత్యసాయి జిల్లా,కలంకౌంటర్ :

## మురళీనాయక్ కుటుంబానికి రూ.25 లక్షలు

● వారికి వైయస్సార్‌సీపీ పూర్తి అండగా ఉంటుంది ● వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి

**శ్రీ సత్యసాయి జిల్లా,కలంకౌంటర్ :** జమ్మూ కశ్మీర్‌లో ఆపరేషన్ సిందూర్‌లో వీర మరణం చెందిన జవాన్ అగ్నివీర్ మురళీనాయక్ కుటుంబాన్ని మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్ మోహన్‌రెడ్డి పరామర్శించారు. బెంగళూరు నుంచి నేరుగా శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కల్లి తండా చేరుకున్న వైయస్ జగన్, అమరుడైన వీర జవాన్ మురళీనాయక్ తల్లిదండ్రులు జ్యోతిబాయి, శ్రీరామ్ నాయక్‌ను పరామర్శించారు. వైయస్ జగన్‌ను చూసిన ఆ వీర జవాన్ తల్లిదండ్రులు దుఖాన్ని ఆపుకోలేకపోయారు. వారిని ఓదార్చి ధైర్యం చెప్పిన ఆయన, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ, ఆ కుటుంబానికి అండగా నిలుస్తుందని చెప్పారు. దేశం కోసం ప్రాణలర్పించిన వీర జవాన్ మురళీనాయక్ త్యాగానికి వెల కట్టలేమన్న వైయస్ జగన్, ఆ కుటుంబానికి పార్టీ తరపున రూ.25 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. ఈ సందర్భంగా వైయస్ జగన్ ఏమన్నారంటే..: మురళీనాయక్ చిన్నవాడైనా రాష్ట్రంలో చాలా మందికి, పెద్దలకు స్ఫూర్తి దాయకంగా ఒక పెద్ద వ్యక్తిగా ఎదిగాడు తన మరణంతో.దేశం కోసం పోరాడుతూ తన ప్రాణ త్యాగంతో అనేక మంది మిగిలిన అన్నదమ్ములు, అక్కచెల్లెమ్మలకు రక్షణ ఇచ్చారు. దేశం కోసం తన పాణాలు కోల్పోయాడు. అలాంటి మురళిని వెనక్కు తేలేం కానీ, అతడు చేసిన త్యాగానికి రాష్ట్ర ప్రజలంతా రుణపడి ఉంటారు. దేశం కోసం పోరాడుతూ, ప్రాణాలు కోల్పోతే రూ.50 లక్షలు ఇచ్చే సంప్రదాయం వైయస్సార్‌సీపీ ప్రభుత్వం మొదలుపెట్టింది. దాని కొనసాగిస్తూ, ఈ ప్రభుత్వం కూడా మురళీ కుటుంబానికి రూ.50 లక్షలు ఇవ్వాలని నిర్ణయించినందుకు కృతజ్ఞతలు. పార్టీ తరపు నుంచి ఆ కుటుంబానికి అండగా ఉంటాం. వైయస్సార్‌సీపీ నుంచి రూ.25 లక్షలు ఇస్తాం. ఇంకా పార్టీ నుంచి ఈ కుటుంబానికి అందరం తోడుగా ఉంటామని వైయస్ జగన్ వెల్లడించారు.

## వంటశాల, షాపింగ్ కాంప్లెక్స్ పరిశీలించిన ఎమ్మెల్యే




**మోపిదేవి,కలంకౌంటర్ :** మోపిదేవి శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పరిశీలించారు. దేవస్థానంలో ఉచిత అన్నదానం వంటశాలను పరిశీలించారు. భక్తులకు వడ్డించే ఆహార పదార్థాలు శుచి, శుభ్రతలతో నాణ్యతలో ఎక్కడా రాజీ లేకుండా తయారు చేయించాలని స్పష్టం చేశారు. అభివృద్ధి పనుల పరిశీలనలో భాగంగా దేవస్థాన కోనేరు ప్రాంగణంలో దేవస్థానం నిధులు రూ.2.75 కోట్లతో నిర్మిస్తున్న రూములు, షాపింగ్ కాంప్లెక్స్ పనులు పరిశీలించారు. నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని సూచించారు. పనులు జరుగుతున్న తీరును దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాల ఈఓ దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆయనకు వివరించారు.

## మిగిలిపోయిన అభివృద్ధి పనులను త్వరలోనే చేపడుతాం



**కుత్బుల్లాపూర్ ( తెలంగాణ),కలంకౌంటర్ :** కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద 130 -సుభాష్ నగర్ డివిజన్ సూరారం కాలనీ వాసులు బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ని కలిసి కాలనీలో మిగిలిపోయి ఉన్న సీసీ రోడ్డు పనులను పూర్తిచేయాలని కోరారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ. సుభాష్ నగర్ డివిజన్ లోని అన్నీ కాలనీలలో అభివృద్ధి పనులను దాదాపు పూర్తిచేశామని, ఇంకా ఏమైనా మిగిలిపోయి ఉంటే ప్రణాళికలు రూపొందింపచేసి త్వరలోనే చేపడుతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు కుమ్మరి చందు, భీమ్ రాజ్, మస్తాన్, గిరి, మున్నా, మహేష్, రవి, రమేష్ పాల్గొన్నారు.

## మజ్జిగ పంపిణీ



**తిరువూరు,కలంకౌంటర్ :** తిరువూరు మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు.




## రాష్ట్రానికి వచ్చేందుకు 91 పెద్ద కంపెనీలు సిద్ధంగా ఉన్నాయి

● ప్రతి పెద్ద కంపెనీకి ఒక నోడల్ ఆఫీసర్ ను నియమించండి! ● వేగవంతంగా యూనిట్ల స్థాపనకు యంత్రాంగం చర్యలు చేపట్టాలి ● ఐటి, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో 5లక్షల ఉద్యోగాలే ప్రభుత్వ లక్ష్యం ● నెలాఖరుకు మన మిత్ర ద్వారా అందుబాటులోకి 400 రకాల సేవలు ● అన్ని ప్రభుత్వశాఖల యాప్ లు, జిఓలు సింగిల్ ప్లాట్ ఫాంపైకి తేవాలి ● ఐటి, ఎలక్ట్రానిక్స్, ఆర్ టిజిఎస్ అధికారులతో మంత్రి లోకేష్ సమీక్ష

**అమరావతి,కలంకౌంటర్ :** రాష్ట్రంలో కొత్తగా తమ సంస్థలను ఏర్పాటుచేయడానికి ముందుకు వచ్చిన పెద్ద కంపెనీలకు అవసరమైన అనుమతులను త్వరితగతిన మంజూరుచేసేందుకు ప్రతికంపెనీకి ఒక నోడల్ ఆఫీసర్ ను నియమించాలని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. ఉండవల్లి నివాసంలో ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల ఉన్నతాధికారులతో లోకేష్ సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... విశాఖ నగరాన్ని అత్యాధునిక సాంకేతికతల కేంద్రంగా, ఐటి హబ్ గా తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ లక్ష్యమని, ఇందుకోసం ప్రణాళికలు రూపొందించాలని కోరారు. రాష్ట్రంలో యూనిట్ల స్థాపనకు ఆసక్తిచూపుతున్న కంపెనీల పెట్టుబడులు, ఉద్యోగాలపై మంత్రి సమీక్షిస్తూ ఇప్పటివరకు 91 ఐటి, ఎలక్ట్రానిక్స్ కంపెనీలు రూ.91,839 కోట్ల పెట్టుబడులు, 1,41,407 ఉద్యోగాలు కల్పించేందుకు ముందుకు వచ్చాయి, వాటికి త్వరితగతిన అనుమతులు మంజూరుచేయాలి, సాధ్యమైనంత త్వరగా కంపెనీలు ఏర్పాటుచేసేలా సంబంధిత కంపెనీల ప్రతినిధులతో సంప్రదింపులు జరపాలి. రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో ఐటి, ఎలక్ట్రానిక్స్ ఉద్యోగాలు కీలకపాత్ర పోషిస్తాయి, రాబోయే అయిదేళ్లలో ఐటి, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో 5లక్షల ఉద్యోగాలు కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని లోకేష్ అన్నారు. ఐటి కంపెనీలకు చెల్లించాల్సిన ప్రోత్సాహక బకాయిలను వెంటనే చెల్లించండి. రాష్ట్రవ్యాప్తంగా వీడియో కాన్ఫరెన్స్ ఎక్విప్ మెంట్ ను ఆధునీకరించండి. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాట్లను వేగవంతం చేయండి. ప్రభుత్వానికి సంబంధించిన పౌరసేవలన్నీ వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా అందుబాటులో ఉంచాలని మంత్రి లోకేష్ ఆదేశించారు. ప్రస్తుతం 317రకాల సేవలు మనమిత్ర యాప్ లో అందుబాటులో ఉన్నాయి. నెలాఖరుకు 400రకాల సేవలకు విస్తరించండి. రెవిన్యూశాఖతో పాటు వివిధరకాల సేవల సమయాన్ని తగ్గించేలా చర్యలు తీసుకోవాలి. ప్రతి సర్టిఫికెట్ బ్లాక్ చెయిన్, క్యూఆర్ కోడ్ తో నిర్ధారించుకునేలా టెక్నాలజీతో అనుసంధానం చేయాలి. మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీలు, పంచాయితీల్లో పన్నుల బకాయిల వివరాలు వాట్సాప్ లో వచ్చేలా ఏర్పాట్లు చేయాలి, బకాయిలకు సంబంధించి ఎప్పటికప్పుడు అలర్ట్ మెసేజ్ లు పంపేలా



చూడాలి. ఆర్ టిజిఎస్ కు సంబంధించి డేటా పాయింట్లు, కెపిఐలను ఇంటిగ్రేట్ చేయాలి. భారత ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రాధాన్య పథకాలనకు సంబంధించి రియల్ టైమ్ సమాచారాన్ని ఆర్ టిజిఎస్ లో పొందుపర్చాలి. సచివాలయం నుంచి గ్రామస్థాయి కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ ను అనుసంధానం చేయండి. తుపానులు, వరదలు, పిడుగులు పడటం వంటి వాతావరణ సమాచారాన్ని రియల్ టైమ్ లో అందించేలా చర్యలు తీసుకోండి. జూన్ 9,10 తేదీల్లో విశాఖపట్నంలో జరిగే ఈ-గవర్నెన్స్ జాతీయ సదస్సుకు విస్తృత ఏర్పాట్లు చేయండి. వివిధ శాఖలకు సంబంధించి సమాచారాన్ని అంతటినీ ఏకీకృతం చేసి ఒక వెబ్ సైట్ లో పొందుపర్చి ఎఐ ఎనేబుల్ చేసేలా చర్యలు తీసుకోవాలి. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ను మరింత సరళతరం చేసేలా చర్యలు చేపట్టాలి. వివిధ రకాల చిరు వ్యాపారాలు, చిన్న పరిశ్రమలకు సంబంధించి సింగిల్ సర్టిఫికేషన్ ఉండేలా క్యూఆర్ కోడ్, బ్లాక్ చెయిన్ టెక్నాలజీ అనుసంధానించాలి. ప్రభుత్వానికి సంబంధించి అన్నిరకాల జిఓలు, యాప్ లను సింగిల్ ప్లాట్ ఫాంపైకి తెచ్చి ఒకే వెబ్ సైట్ లో అందుబాటులోకి తేవాలని మంత్రి లోకేష్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఐటి అండ్ సి సెక్రటరీ కాటంనేని భాస్కర్, స్పెషల్ సెక్రటరీ బి.సుందర్, ఎకనమిక్ డెవలప్ మెంట్ బోర్డు సిఇఓ సాయికాంత్ వర్మ, ఎపి టెక్నాలజీ సర్వీసెస్ ఎండి సూర్యతేజ్, ఆర్ టిజిఎస్ సిఇఓ ప్రకార్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

## సొంతూరులో పరిశ్రమలు పెట్టండి

● రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ● రొద్దంలో 59.37 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు భూమి పూజ ● ఎంఎస్ఎంఈ పార్కులతో ప్రతి ఇంటి నుంచి ఓ వ్యాపారవేత్త ● ఇదే సీఎం చంద్రబాబు లక్ష్యమన్న మంత్రి సవిత ● అన్ని నియోజక వర్గాల్లోనూ ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటు ● జగన్ హయాంలో పారిశ్రామికంగా కుంటుపడిన ఏపీ : మంత్రి సవిత

**పెనుకొండ/రొద్దం,కలంకౌంటర్ :** 'ఎక్కడెక్కడో పరిశ్రమలు ఏర్పాటు చేసే బదులు సొంతూరులో కంపెనీలు పెట్టండి.. మన ప్రాంతాల అభివృద్ధిలో భాగస్వాములవ్వండి.. మన యువతకు ఉద్యోగిలిచ్చి... రాష్ట్రానికి, దేశానికి ఆదాయం వచ్చేలా సహకరించండి' అని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు, యువతకు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత పిలుపునిచ్చారు. ప్రతి ఇంటి నుంచి ఒకరిని పారిశ్రామికవేత్తగా తీర్చిదిద్దడమే లక్ష్యంతో సీఎం చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారన్నారు. దీనిలో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నారని మంత్రి తెలిపారు. రొద్దంలో 59.37 ఎకరాల్లో ఏర్పాటు చేయబోతున్న ఎంఎస్ఎంఈ పార్కుకు మంత్రి సవిత మంగళవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఏపీని పారిశ్రామిక హబ్ గా సీఎం చంద్రబాబు అభివృద్ధి చేస్తున్నారన్నారు. దీనిలో భాగంగా యువతను వ్యాపారవేత్తలుగానూ తీర్చిదిద్దే మరో బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లోనూ ఎంఎస్ఎంఈ పార్కులు, ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మొదటి దశలో 50 పార్కులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రొద్దంలో 59.37 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

**తొలి దశలో 20 ఎకరాల్లో...** రొద్దం ఎంఎస్ఎంఈ పార్కులో తొలి



దశలో 20 ఎకరాల్లో చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. 115 పరిశ్రమలకు ఏడు సెంట్లు చొప్పున భూకేటాయింపులు చేస్తున్నట్లు వెల్లడించారు. రూ.7 కోట్లతో రోడ్లు, కాలువలు, వీధి దీపాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఉత్సాహవంతులైన ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు, యువకులు ఈ సదావకాశాన్ని వినియోగించుకోవాలని మంత్రి కోరారు.

## లోతైన అధ్యయనంతోనే రాష్ట్ర ఆదాయంలో పెరుగుదల



(మొదటిపేజీ తరువాయి)

ఆర్జించాలని లక్ష్యం పెట్టుకున్నారు. ఇది గత ఏడాది కన్నా 29 శాతం అధికం. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 1 నుంచి మే 11 వరకు వాణిజ్య పన్నులు, అటవీ ఆదాయంలో తగ్గుదల కనిపించగా, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ నుంచి అనూహ్యంగా ఆదాయం పెరిగింది. అటు, ఈ ఆర్థిక సంవత్సరం మే 11 వరకు కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆదాయం గతేడాది కన్నా 26 శాతం తగ్గింది. 2024-25లో ఇదే కాలానికి కేంద్రం నుంచి రూ.17,170 కోట్లు రాగా... ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.12,717 కోట్లు మాత్రమే వచ్చింది అని అధికారులు వివరించారు.

**కొత్త ఎక్సైజ్ పాలసీతో పెరిగిన ఆదాయం :** రాష్ట్రంలో కొత్తగా తీసుకువచ్చిన ఎక్సైజ్ పాలసీతో ఆదాయంలో వృద్ధి నమోదైంది. 2024-25లో రాష్ట్రానికి ఎక్సైజ్ ఆదాయం రూ.28,842 కోట్లు వచ్చింది. ఇది అంతకుముందు ఏడాది కన్నా 14.84 శాతం ఎక్కువ. అయితే దక్షిణాది రాష్ట్రాలైన తెలంగాణ, తమిళనాడు, కర్నాటకతో పోల్చుకుంటే ఏపీలో ఎక్సైజ్ ఆదాయం ఇప్పటికీ తక్కువగానే ఉంది. 2025-26 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నెలలో రాష్ట్రానికి రూ.2,116 కోట్ల ఆదాయం రాగా, ఈ ఏడాది మొత్తం ఎక్సైజ్ ద్వారా రూ.33,882 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నట్లు అధికారులు వివరించారు.

**హైదరాబాద్ లేని లోటు పూడ్చు కోవాలి..** తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ నుంచే 75 శాతం ఆదాయం వస్తుందని...మనకు అటువంటి అవకాశం లేనందున ఆదాయం పెంచుకునే మార్గాలను అన్వేషించాలని సిఎం చంద్రబాబు అన్నారు. ఏడాది కాలంలో తీసుకువచ్చిన పాలసీలను పటిష్టంగా అమలు చేయడం ద్వారా రాష్ట్ర ఆదాయం పెరిగేలా చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సొంత ఆదాయ వనరులు పెంచుకుని తన కాళ్లపై తాను నిలబడాల్సిన అవసరం ఉందని...అప్పుడే అభివృద్ధి, సంక్షేమ పథకాలకు విరివిగా నిధులు ఖర్చు చేయగలం అని సిఎం అన్నారు. కేంద్ర సాయం, అప్పులు అనేది ప్రాథమిక దశలో నిలబడేందుకు మాత్రమే ఉపయోగపడతాయని.... మంచి పనితీరు ద్వారా ఆయా శాఖల్లో ఆదాయం పెరిగే ప్రణాళికలు అమలు చేయాలని సిఎం అధికారులకు స్పష్టం చేశారు. ఒకటి రెండు శాఖలు ఏడాది కాలంలో అనుకున్నంత పురోగతి సాధించలేదని....ఆయా శాఖల పనితీరు మెరుపడాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి తెలిపారు.

## మైనర్ బాలికను వేధించిన నిందితుడికి ఆరు నెలలు జైలు 6000 రూపాయలు జరిమానా

**బంటుమిల్లి,కలంకౌంటర్ :** మైనర్ బాలికను వేధించిన వ్యక్తిపై ఫోక్స్ చట్టం కింద నమోదైన కేసు కు సంబంధించి మచిలీపట్నం గౌరవ స్పెషల్ ఫోక్స్ కోర్ట్, నిందితుడికి ఆరు నెలల సాధారణ జైలు,? 6000లు జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పినట్లు బంటుమిల్లి ఎస్ఐ ఏ గణేష్ కుమార్ తెలిపారు. వివరాల్లోకి వెళ్తే 2020 వ సంవత్సరంలో బంటుమిల్లి మండలం ముల్లపర్రు గ్రామంలో ఒక మైనర్ బాలికను ఈదా ప్రమోద్ కుమార్ వేధింపులకు గురి చేసినట్లు ఫోక్స్ చట్టం కింద కేసు నమోదు జరిగింది. ఇదా ప్రమోద్ కుమార్ పై నేరం రు జువు అవడంతో మచిలీపట్నం గౌరవ స్పెషల్ ఫోక్స్ కోర్ట్ జడ్జి గాజుల వెంకటేశ్వర్లు ఈ దా ప్రమోద్ కుమార్ కు ఆరు నెలలు సాధారణ జైలు, 6000 రూపాయలు జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు చెప్పినట్లు బంటుమిల్లి ఎస్ఐ గణేష్ కుమార్ తెలిపారు.

# సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆశీస్సులు కోరుతూ పూజలు

## జనసేన ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ









**మోపిదేవి,కలంకౌంటర్ :** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మోపిదేవి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం ఆలయానికి వచ్చిన ఎంపీ, ఎమ్మెల్యేకు దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి పుట్టలో పాలు పోసి స్వామివారిని దర్శించుకుని దేశం కోసం, సైన్యం కోసం ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం మోపిదేవి పురవీధుల్లో భారీ జాతీయ పతాకంతో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ బాలశౌరి మాట్లాడుతూ పెహల్గామ్ ఘటనతో దేశం దిగ్భ్రాంతికి గురైందన్నారు. ఉగ్రవాద దుశ్చర్యకు బలైన రాష్ట్ర వాసులకు జనసేన పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆర్థిక సహాయం చేశారన్నారు. ఆపరేషన్ సింధూర్ లో ప్రాణాలు కోల్పోయిన రాష్ట్ర సైనికుని కుటుంబానికి పవన్ కళ్యాణ్ స్వంతంగా రూ.25 లక్షలు అందించారని తెలిపారు. భారత్ జోలికి వస్తే ఏం చేయగలమో నిరూపించామన్నారు. దేశ ప్రధానికి, సైన్యానికి ధైర్యం, స్ఫూర్తి ఇవ్వాలని సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి పూజలు చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ యువతలో దేశ భక్తి ప్రేరేపించేందుకు జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కృషి చేస్తున్నారని తెలిపారు. పెహల్గామ్ ఘటనపై దేశంలో మొట్టమొదట స్పందించిన పార్టీ జనసేన అని తెలిపారు. సైన్యానికి ఇతోధిక బలం, భారత ప్రభుత్వానికి ఆశీస్సులు పుష్కలంగా ఇవ్వాలని సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి పూజలు చేసినట్లు తెలిపారు. దేశ రక్షణకు మోపిదేవి స్వామి శక్తి, ఆశీస్సులు ఇవ్వాలని, ప్రధాని మోడీకి బలం, ఉత్తేజం ఇవ్వాలని పూజలు చేసినట్లు తెలిపారు. త్రివర్ణ పతాక రెపరెపలతో ప్రతి ఒక్కరిలో స్ఫూర్తి కలిగించినట్లు తెలిపారు. ఎన్ని విపత్తులు వచ్చినా ఈ దేశాన్ని కాపాడుకోవాలని బుద్ధప్రసాద్ పిలుపునిచ్చారు. ఒప్పందాలు ఉల్లంఘించడం పాకిస్తాన్ కు అలవాటు అని, ఈ స్థితిలో ప్రధానికి అండగా, సైన్యానికి మద్దతుగా నిలవాలని కోరారు. అవనిగడ్డ నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్, శీలం అశ్విన్ కుమార్, డీసీఎంఎస్ చైర్మన్, నియోజకవర్గ బందరు నియోజకవర్గ ఇంచార్జి బండి రామకృష్ణ, పెడన నియోజకవర్గ ఇంచార్జి పంచకర్ల సురేష్, పామర్రు నియోజకవర్గ ఇంచార్జి తాడిశెట్టి నరేష్, ఏపీఐఐసీ డైరెక్టర్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి మండలి రాజేష్, పెనమలూరు నియోజకవర్గ నాయకులు ముప్పా రాజా, గుడివాడ నాయకులు సందు పవన్, ఘంటసాల, గన్నవరం ఏఎంసీ చైర్మన్లు తోట కనకదుర్గ, గరికిపాటి శివశంకర్, జిల్లా ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు, విజయవాడ నాయకురాలు డాక్టర్ రాధికా మాధవి, జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాల్, సీనియర్ నాయకులు బచ్చు వెంకట్ నాధ్ ప్రసాద్, చెన్నగిరి సత్యనారాయణ, జిల్లా కార్యదర్శులు గాజుల శంకరరావు, కొండవీటి సునీత, ప్రాజెక్టు చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, నాగాయలంక డీసీ చైర్మన్ బండ్రెడ్డి నాగ మల్లికార్జునరావు, పార్టీ మండల అధ్యక్షులు పూషడపు రత్నగోపాల్, గుడివాక శేషుబాబు, చోడగం విమల్ కృష్ణ, రాజనాల వీరబాబు, బొందలపాటి వీరబాబు, సర్పంచులు మండలి ఉదయ భాస్కర్, , అరజా సంధ్యారాణి, సనకా వెంకట రాజేష్, మత్తి నాగమల్లేశ్వరరావు, , నియోజకవర్గ ఐటీ కో-ఆర్డినేటర్ సూదాని నందగోపాల్, ఆసుపత్రి డైరెక్టర్ బచ్చు కృష్ణకుమారి, గుడివాక శివరావు, అడపా రాంబాబు, బాదర్ల లోలాక్షు నాయుడు, గోళ్ళ శ్రీనివాసరావు, మెరకనపల్లి నరేష్, బండ్రెడ్డి హరి, తుంగల నరేష్, పూతబోయిన కరుణ కుమార్, తోట కృష్ణాంజనేయులు, పిరాటి శిరీష, ఆకుల వెంకట్రామయ్ అరజా కిరణ్ కాంత్, మత్తి వంశీకృష్ణ, అరజా రాధిక, బచ్చు శ్రీహరి, కోసూరు శివ నాగ మల్లేశ్వరరావు, కోసూరు రామాంజనేయులు, కూరేటి రాఘవ, పెద్దసంఖ్యలో జనసైనికులు, వీర మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.







**దేశ నాయకత్వానికి,సైన్యానికి దైవ బలం ఉండాలని బిక్కవోలు శ్రీ కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించిన రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్.**

–బిక్కవోలు (తూ.గో. జిల్లా),కలంకౌంటర్ :

# చార్మినార్ అందాలకు సుందరాగుల ఫిదా

● ప్రపంచ ప్రఖ్యాత చార్మినార్ వద్ద చేరుకున్న 109 దేశాల మిస్ వరల్డ్ కంటెస్టెంట్స్. ● మార్ఫా వాయిద్యాలతో స్వాగతం మిస్ వరల్డ్ కంటెస్టెంట్స్ కు స్వాగతం పలికిన స్థానికులు. ● అరబ్బీ మర్ఫా వాయిద్యాలకు అనుగుణంగా స్టెప్పులేసిన కొందరు మిస్ వరల్డ్ కంటెస్టెంట్లు. ● అందాల రాయబారులతో చార్మినార్ పరిసరాలకు సరికొత్త శోభ . ● చార్మినార్ వద్ద ప్రత్యేకంగా ఫోటోషూట్ కు హాజరైన సుందరాంగులు. ● చార్మినార్ వేదిక నుండి ప్రజలకు అభివాదం చేసిన అందగత్తెలు ● చరవాణుల్లో చార్మినార్ అందాలను బంధించిన అందగత్తెలు. ● వేడుకగా సుందరాగుల హెరిటేజ్ వాక్ ● చార్మినార్ సమీపంలోని చుడీ బజారు దుకాణాల్లో గాజులు, ముత్యాల హారాలు తదితర అలంకరణ వస్తువుల షాపింగ్ చేసిన అందాల భామలు.● గాజుల తయారీని స్వయంగా పరిశీలించిన మిస్ వరల్డ్ కంటెస్టెంట్ లు. తయారీ దారులకు ప్రశంస





**హైదరాబాద్,కలంకౌంటర్ :** ప్రపంచ ప్రఖ్యాత చార్మినార్ సందర్శన 109 దేశాల మిస్ వరల్డ్ కంటెస్టెంట్స్ కు అద్భుతమైన మధురానుభూతులను మిగిల్చింది. ఐదు శతాబ్దాలుగా హైదరాబాద్ మధ్యన ఠీవిగా నిలబడి ఉన్న ఈ సొగసైన కట్టడం ను చూసి సుందరాంగులు మంత్రముగ్ధులయ్యారు. సందర్శన కోసం చార్మినార్ వద్దకు పర్యాటక బస్సులతో చేరుకున్న మిస్ వరల్డ్ కంటెస్టెంట్ లకు అధికారులు రెడ్ కార్పెట్ స్వాగతం పలికారు. స్థానిక కళాకారులు వారికి సాంప్రదాయిక అరబ్బీ మార్ఫా వాయిద్యాలతో స్వాగతం పలికారు. మార్ఫా శబ్దాలతో మమేకం చేస్తున్నట్లుగా కొందరు కంటెస్టెంట్స్ ప్రత్యేక స్టెప్పులతో నృత్యం చేసి, స్థానిక సంస్కృతికి అనుకూలంగా తాము అనునయించారు. ఈ అందాల రాయబారులతో చార్మినార్ పరిసరాలు ఒక సరికొత్త శోభను పొందాయి. ప్రత్యేకంగా చార్మినార్ వద్ద ఫోటోషూట్ కు హాజరైన సుందరాంగులు, ఈ చారిత్రాత్మిక వేదిక నుండి ప్రజలకు అభివాదం చేస్తూ, తమ ఆనందం, సంతోషాన్ని వ్యక్తం చేశారు. చార్మినార్ అందాలను ఈ అందగత్తెలు తమ చరవాణులలో ఫోటోలను తీసుకున్నారు.అనంతరం ప్రపంచ అందగత్తెలు చార్మినార్ ముందు నిర్వహించిన హెరిటేజ్ వాక్ సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి తెలిపారు. సందర్శనలో భాగంగా, చార్మినార్ సమీపంలోని ప్రసిద్ధ చుడీ బజార్ (లాడ్ బజార్)లో కంటెస్టెంట్స్ గాజులు, ముత్యాల హారాలు మరియు ఇతర అలంకరణ వస్తువుల షాపింగ్ చేసి, స్థానిక హస్తకళల పట్ల ఆసక్తిని ప్రదర్శించారు. కొందరు కంటెస్టెంట్స్ గాజుల తయారీ ప్రక్రియను స్వయంగా పరిశీలించి, నిపుణులైన కారిగర్లు (కళాకారులు), శిల్పులకు ప్రశంసలు తెలిపారు. వారి శ్రమ , నైపుణ్యం ప్రపంచ స్టేజిపై కూడా గుర్తించదగినదని భావించారు. ఈ కార్యక్రమం ద్వారా, హైదరాబాద్ యొక్క సాంస్కృతిక వారసత్వం మరియు సౌందర్యం ప్రపంచానికి తెలియజేసినట్లయ్యింది. మిస్ వరల్డ్ కంటెస్టెంట్స్ సందర్శన కేవలం పోటీలలో భాగంగానే కాకుండా, ప్రపంచ శాంతి ,సాంస్కృతిక సామ-రస్యానికి సాక్ష్యంగా నిలిచింది.

# కుప్పం ఏరియా పొలిటికల్ డెవలప్మెంట్ కమిటీ చైర్మన్ గా ప్రభుత్వ విప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్



**కందుకూరు,కలంకౌంటర్ :** కుప్పం ఏరియా పొలిటికల్ డెవలప్మెంట్ అథారిటీ కమిటీ చైర్మన్ గా కుప్పం నియోజకవర్గ సమన్వయ కమిటీ చైర్మన్,ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నియమించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సొంత నియోజకవర్గమైన కుప్పం నియోజకవర్గంలో చంద్రబాబు నాయుడు సూచనలు సలహాలతో, కుప్పం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకుల సహకారంతో కుప్పం నియోజకవర్గాన్ని శక్తి వంచన లేకుండా ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ అహర్నిశలు కృషి చేస్తున్నారు. గత ఎన్నికల్లో చంద్రబాబు నాయుడుని కుప్పంలో ఓడించాలని జగన్మోహన్ రెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఇలాంటి వారెంతమందో ప్రయత్నించినప్పటికీ ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ శక్తి వంచన లేకుండా కృషిచేసి చంద్రబాబు నాయుడుకి గెలుపుతో పాటు, అత్యంత మెజార్టీ రావడానికి కీలక పాత్ర పోషించి చంద్రబాబు నాయుడు హృదయంలో చోటు సంపాదించుకున్నాడు. అటువంటి కంచర్ల శ్రీకాంత్ కు ప్రభుత్వ విప్ పదవి వివరించింది. దానితోపాటు కుప్పం ప్రాంతాన్ని అన్ని విధాల అభివృద్ధి చెయ్యాలనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంకల్పానికి ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ అన్ని విధాల అర్హుడని గుర్తించి కుప్పం ఏరియా పొలిటికల్ డెవలప్మెంట్ అథారిటీ కమిటీ చైర్మన్ గా నియమించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ తనకు కుప్పం ఏరియా డెవలప్మెంట్ అథారిటీ కమిటీ చైర్మన్ గా నియమించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, మంత్రి యువ నాయకుడు నారా లోకేష్ కు ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్సీ డాక్టర్ శ్రీకాంత్ బంధువులు, మిత్రులు, పలువురు టిడిపి నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

# తిరుమలలో వీఐపీ సిఫార్సు లేఖల స్వీకరణపై మంత్రి ఆనం కీలక ప్రకటన



**తిరుమల,కలంకౌంటర్ :** తిరుమలలో ఈ నెల 15 (గురువారం) నుంచి వీఐపీ సిఫారసు లేఖలను స్వీకరిస్తామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. ఏపీ, తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలపై ఎల్లుండి నుంచి బ్రేక్ దర్శనాలు ఉంటాయని మంత్రి ప్రకటించారు. కాగా, మే 1 నుంచి జులై 15 వరకు సిఫారసు లేఖల బ్రేక్ దర్శనాలు రద్దు చేస్తున్నట్లు గతంలో టీటీడీ ప్రకటించిన విషయం తెలిసిందే. టీటీడీ బోర్డు సభ్యులు, ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలు చెల్లవని స్పష్టం చేసింది. ప్రోటోకాల్ వీఐపీలకు మాత్రమే బ్రేక్ దర్శనాలు ఉంటాయని చెప్పింది. వేసవి సెలవులను దృష్టిలో పెట్టుకుని భక్తుల రద్దీ దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అప్పుడు టీటీడీ వెల్లడించింది. అయితే, ఇప్పుడు ఆ గడువును తగ్గించి మే 15వ తేదీ నుంచే ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలను స్వీకరిస్తామని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు.



**ఏపీ హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ని వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.**

–అమరావతి,కలంకౌంటర్ :

# రెడ్ క్రాస్ అవార్డు అందుకున్న కలెక్టర్ ని సన్మానించిన కేంద్ర మంత్రి



**భీమవరం,కలంకౌంటర్ :** పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఇటీవల ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర స్థాయి అవార్డు అందుకున్న సందర్భంలో, ఆమెను కేంద్ర భారీ పరిశ్రమల మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ భీమవరం కలెక్టరేట్లో మంగళ వారం శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందిస్తూ సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నాగరాణి సేవా భావం ఎంతో అభినందనీయ మన్నారు. వరదల సమయంలో ప్రజలకు అండగా నిలిచారని ఇటువంటి అధికారులు ప్రజల విశ్వాసానికి నిలువెత్తు ఉదాహరణగా నిలుస్తారని ప్రశంసించారు. నాగరాణి ఇటీవల ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా రెడ్ క్రాస్ అవార్డు స్వీకరించారు. వరదల సమయంలో ఆమె స్వయంగా లోతట్టు ప్రాంతాలకు వెళ్లి పరిస్థితిని సమీక్షించి, బాధితులకు ఆహార సరఫరా నిర్వహించారు. అంతేకాదు, ఆమె తన వంతుగా ముఖ్యమంత్రి సహాయనిధికి వ్యక్తిగత విరాళం కూడా ఇచ్చారు. ఈ కృషి ఆమెకు రాష్ట్రవ్యాప్తంగా మంచి పేరు తెచ్చింది.

# సరిహద్దు....

మనం కట్టుకొన్న ఇంట్లో దూరిన దొంగతో ఎన్నాళ్ళు కాపురం చేస్తాం.
అదేదో కథలో సాధువు కాటు వేయొద్దంటే,
పిల్లలు రాళ్ళు విసిరి పాముతో ఆటలాడినట్లుగా
ఉగ్రవాదులు మన సరిహద్దుల్లో దీపావళి జరుపుకొంటున్నారు.
విడవమంటే పాముకు కోపం
కరవమంటే కప్పకు కోపం అన్నట్లుగా
విడవలేక, కరవలేక పోతే దేశమా!
వేరుశనగపొట్టులా నిన్నూది
నమిలేయడం ఖాయం.
కృష్ణ దేమన్నాడో తెలుసుగా
యధా యధా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత!
వినబడలా!
ఆయుధం తీసుకొని అర్జునుని లా ఉరుకు,
నరుకు
సరిహద్దంటే....... నీ ఉనికి.
సరిహద్దంటే....... నీ దేశ ఔన్నత్యం.
సరిహద్దంటే...... మన జీవన ప్రాకారం.
పో!
సరిహద్దును దున్నేసిన వాడిని దున్నేసి
నిలువెత్తు జెండాను ఎగురేసి
నిశ్చింతగా నిదురపో.



**గాదంశెట్టి శ్రీనివాస్**
**గిడుగురామ్మూర్తి**
**రాష్ట్ర పురస్కార**
**గ్రహీత, ఉప్పుగుండూరు, ప్రకాశం జిల్లా.**

# వక్కలగడ్డ జంట క్రిమినల్ కేసులు కొట్టివేత

## కృష్ణాజిల్లా ఆరవ అదనపు జిల్లా జడ్జి తీర్పు







**మచిలీపట్నం,కలంకౌంటర్ :** చల్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఐదు సంవత్సరాల క్రితం వక్కలగడ్డ గ్రామంలో జరిగిన పరస్పర క్రిమినకేసులలో ఇరువురు ముద్దాయిలపై నేరం రుజువు కాకపోవటంతో రెండు కేసులు కొట్టివేస్తూ కృష్ణాజిల్లా ఆరవ అదనపు జిల్లా జడ్జి పి. పాండురంగారెడ్డి మచిలీపట్నంలో మంగళవారం తీర్పులు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం గూడూరు కు చెందిన జి పవన్ కుమార్(35) మచిలీపట్నం ఇంగ్లీష్ పాలెం చెందిన ప్రైవేట్ కాలేజీలో లెక్చరర్ గా పనిచేస్తున్న మాగంటి నాగలక్ష్మి(28) అనే యువతీతో ఐదు సంవత్సరాల క్రితం మచిలీపట్నం లో ప్రైవేట్ ఆస్పత్రిలో రోగులను పలకరించడానికి వచ్చి ఇరువురి మధ్య సినీ పక్కిలో ప్రేమ ప్రారంభమైంది. కొంతకాలం కలిసి తిరిగారు. 2020 మే 24వ తేదీన పవన్ కుమార్ నాగలక్ష్మి కలిసి చల్లపల్లి మండలం వక్కలగడ్డ గ్రామంలో ఒక గదిలో ఉండి ఇరువురి మధ్య వచ్చిన పరస్పర గొడవలతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. మాగంటి నాగలక్ష్మి పై హత్యాయత్నం కేసు, పవన్ కుమార్ పై ప్రేమ పేరుతో వంచించాడని క్రిమినల్ కేసును అప్పటి చల్లపల్లి ఎస్సై పి.నాగరాజు రెండు కేసులను నమోదు చేశారు. కేసు విచారణలో ఇరువురు ప్రేమికుల తో పాటు ఇతర సాక్షులను విచారించి నిందితులపై తగిన సాక్షాదారాలు లేకపోవడంతో ఇరువురిపై కేసులు కొట్టివేస్తూ న్యాయమూర్తి పి. పాండురంగారెడ్డి తీర్పులు చెప్పారు. నిందితుల తరఫున లంకిశెట్టి బాలాజీ, పేర్ని సురేష్, జొన్నల వెంకట నాగరాజు న్యాయవాదులుగా వ్యవహరించారు.

# మంత్రి టీజీ భరత్ ను కలిసిన సీహెచ్ఆర్





**గుంటూరు,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ రాష్ట్ర మంత్రి టీజీ భరత్ ను కలిశారు.అనంతరం క్రేన్ సంస్థలు అధినేత గ్రంధి కాంతారావు ను కలిసి రాజమండ్రి లో జరిగే సభకు రావాలని ఆహ్వానించారు.

# దళితులకు అంబేద్కర్, బాబూ జగ్జీవన్ రామ్ రెండు కళ్లు

● బంగారు కుటుంబం కాన్సెప్ట్ తో సీఎం చంద్రబాబు సమానత్వానికి అర్థం చెప్పారు - హెూం మంత్రి అనిత





**తణుకు,కలంకౌంటర్ :** ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని నమ్మి ఓట్లేసి చరిత్రలో కనీవినీ ఎరుగని విజయాన్ని అందించి నేటికి ఏడాది పూర్తి అయిందని రాష్ట్ర హెూం మరియు విపత్తు నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తుందన్నారు. దళితుల సంక్షేమం, అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. తణుకు నియోజకవర్గంలో సుమారు రూ.6.5 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులను ప్రారంభిచడంతో పాటు శంకుస్థాపనలు చేశారు. నియోజకవర్గంలోని తణుకు, అత్తిలిలో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపనలతో పాటు కమ్యూనిటీ హాల్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ బిఈర్ అంబేద్కర్, బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాలను హెూంమంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో హెూంమంత్రి అనిత మాట్లాడుతూ.. అంబేద్కర్, బాబూ జగ్జీవన్ రామ్ దళితులకు రెండు కళ్ల లాంటి వారన్నారు. అలాంటి వ్యక్తుల విగ్రహాలను ఒకేచోట ఏర్పాటు చేసుకోవడం దళితుల ఐక్యతకు నిదర్శనమని చెప్పారు. 2019లో జగన్ ను నమ్మి ప్రజలు ఓట్లు వేస్తే.. దళితులను టార్గెట్ చేసి పాలన సాగించారని మండిపడ్డారు. డాక్టర్ సుధాకర్ ను పిచ్చివాడిగా ముద్రవేసి చనిపోయేలా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితుడ్ని చంపి డోర్ డెలివీర చేసిన ఘనత వైసీపీ నాయకులదేనని మండిపడ్డారు. ఓ మహిళా అధికారిని ఎన్నో రకాలుగా వేధించారన్నారు. మాజీ ఎమ్మెల్యే టీడీఆర్ బాండ్ల స్కామ్ లో మునిగిపోయారన్నారు. కానీ కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో దళితుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందన్నారు. బంగారు కుటుంబం కాన్సెప్ట్ తో పీ4 విధానం ద్వారా అణగారిన వర్గాల అభ్యున్నతికి ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. సమానత్వానికి మార్గదర్శిగా సీఎం చంద్రబాబు పాలన సాగుతోందన్నారు. పర్యటనలో భాగంగా ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ ఆధ్వర్యంలో హెూంమంత్రి అనిత మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ చేశారు.

# 20 లక్షల విలువైన సేవా కార్యక్రమాలు

## వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ ఆద్వర్యంలో

















**విశాఖపట్నం,కలంకౌంటర్ :** వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ ఆద్వర్యంలో విశాఖపట్నం లో ఉడా చిల్డ్రన్స్ థియేటర్ లో అంతర్జాతీయ అధ్యక్షుడు ఇరుకుల్ల రామకృష్ణ అధ్య క్షతన జరిగిన ఉన్నత స్థాయి ప్రతినిధులు సమావేశం సందర్భంగా 20 లక్షల విలువైన సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవ సరమైన 14 టాయిలెట్స్ నిర్మాణానికి, సోలార్ పవర్ ప్లాంట్,బెంచ్ లు ఇలా వివిధ రకాల సేవా కార్యక్రమా లకు గవర్నర్ లు ,వివిధ స్థాయిల్లో ఉన్న ప్రతినిధులు సహకరించారు. వి బి201a విజిట్ చేసి,మొదటి ఇంటర్నేషనల్ గవర్నింగ్ బాడీ సమావేశం నిర్వహించారు.

# రక్తదానం మానవత్వానికి మరో రూపం..

● రక్తదానంపై యువతలో చైతన్యం రావాలి.. ● రక్తదానంపై సమాజంలో ఉన్న అపోహలను తొలగిద్దాం... ● వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్.





**విజయవాడ,కలంకౌంటర్ :** రక్తదానం మానవత్వానికి మరో రూపమని ప్రాణాపాయి స్థితిలో ఉన్నవారికి సకాలంలో రక్తం అందించడం ప్రాణాలను కాపాడడం మరో జన్మనివ్వడమేనని, రక్తదానం చేయడంవల్ల అనారోగ్య సమస్యలు వస్తాయని సమాజంలో ఉన్న అపోహలను తొలగించి రక్తదానానికి ముందుకు వచ్చేలా యువతను ప్రొత్సహించడం అభినందనీయమని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నారు. స్థానిక సూర్యరావు పేట నక్కలరోడ్డులోని శ్రీధర్ కోచింగ్ సెంటర్ నందు మంగళవారం నిర్వహించిన మోగా రక్తదానం శిభిరాన్ని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రక్తదానం చేయ డం మానవత్వానికి మరో రూపంగా భావించాలన్నారు. ప్రాణాపాయి స్థితిలో ఉన్నప్పుడు సకాలంలో రక్తం లభించకపోవడం వలన ఎంతో మంది ప్రాణాలను కోల్పోయిన సంఘటనలు ఉన్నాయన్నారు. కార్ల్ ల్యాండ్ స్టీనర్ అనే ఒక మానవతావాది రక్తంలో ఉండే గ్రూపులను వర్గీకరించి ఉండకపోతే ప్రపంచంలో ఇప్పటికీ రక్తమార్పిడి కారణంగా మరణాలు సంభవించేవన్నారు. రాష్ట్రంలో అనేక మంది రక్త హీనతతో భాదపడుతున్నారని సుమారు 6 వేల మందికి పైగా తలసీమియా వ్యాధికి గురి కావడం జరిగిందని వీరి ప్రాణాలను కాపాడేందుకు నిరం తరం రక్త మార్పిండి చేయాల్సిన అవసరం ఉందన్నారు. రక్తదానం అనేది ప్రాణదానం లాంటిద అన్నారు. ప్రమాదానికి గురి అయినప్పుడు, అత్యవసర శస్త్ర చికిత్సల సమయంలో రక్త అవసరం వుంటుందన్నారు. రక్తాన్ని దానం మాత్రమే చేయవచ్చునని ఉత్పత్తి చేయలేమన్నారు. రక్త అవసరమయ్యే జీవితాలకు రక్తదాతలే ప్రాణదాతలన్నారు. 18 సంవత్సరాల నుండి 60 సంవత్సరాల వయస్సు వరకు రక్తదానం చేయవచ్చునని, జీవిత కాలంలో ఒక వ్యక్తి దాదాపు 168 సార్లు రక్తాన్ని దానం చేయవచ్చునన్నారు. రక్తదానంతో నీరసించి పోతామనే అపోహను తొలగించి రక్తదానం చేసిన ప్రతీ సారి ఆరోగ్యవంతమైన కొత్త రక్తాన్ని పొందగలుగుతామనే విషయాన్ని ప్రజలలోకి తీసుకువెళ్లి రక్తదానం వైపు మొగ్గు చూపేలా కృషి చేయాలన్నారు. కొత్త యువత కూడా ముందుకు వచ్చి స్వచ్చందంగా రక్తదాన శిబిరాలలో పాల్గొనేలా స్ఫూర్తిని నింపాల్సిన అవసరం ఉందని మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు. అత్యున్నత ప్రమాణాలతో పోటీ పరీక్షలకు యువతను సన్న ద్ధులను చేయడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ మోగా రక్తదానం శిభిరాలను ఏర్పాటు చేసిన శ్రీధర్ కోచింగ్ సెంటర్ నిర్వహులను అభినందిస్తున్నానన్నారు. దేశ ప్రగతిలో యువత పాత్ర కీలకమన్నారు. యువతలో మేధోశక్తిని పెంపొందించి వారిని అన్ని రం గాలలో అగ్రగామిగా నిల్పాలన్న లక్ష్యంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు అమలు చేయడంతో పాటు మెరుగైన ఉపాధి అవకాశాలను చర్యలు తీసుకుంటుందని వీటిని యువత సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సత్య కుమార్ యాదవ్ పిలుపు నిచ్చారు. కార్య క్రమంలో శ్రీధర్ కోచింగ్ సెంటర్ డైరెక్టర్లు కొమ్మూరి శ్రీధర్, సీతారా మిరెడ్డి, డా. మధన్ మోహన్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ఈనెల 22వ తేదీ నాటికి 910 ఇళ్ళు పూర్తి చేయాలి - జిల్లా ఇన్చార్జి, కలెక్టర్ గీతాంజలి శర్మ

**మచిలీపట్నం,కలంకౌంటర్ :** జిల్లాలో గృహ నిర్మాణం పై ప్రత్యేక దృష్టి సారించి ఈనెల 22వ తేదీ నాటికి 910 ఇళ్ళు పూర్తి చేయాలని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ అధికారులను ఆదేశించారు. మంగళవారం మధ్యాహ్నం జిల్లా ఇన్చార్జి కలెక్టర్ నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో గృహ నిర్మాణ పురోగతిపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గృహ నిర్మాణంలో జిల్లా రాష్ట్రంలోనే చాలా వెనుకబడి ఉండటంతో జిల్లా ఇన్చార్జి కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్చార్జి కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో 3 లక్షల గృహాలను పూర్తి చేయాలన్నది లక్ష్యం కాగా, జిల్లా లక్ష్యం 10000 ఇళ్లు పూర్తిచేయాల్సి ఉందన్నారు. గత ఏప్రిల్ నెల 16వ తేదీన జిల్లా కలెక్టర్ సమీక్షించినప్పుడు ఆర్. సి (రూఫ్ క్యాస్టింగ్) స్థాయిలో 506 గృహాలు, ఆర్.ఎల్. (పై కప్పు) స్థాయిలో 2, 033 గృహాలు ఉన్నాయన్నారు. ఇప్పుడు పురోగతి పరిశీలిస్తే కేవలం 237 గృహాలు మాత్రమే పూర్తి చేయడం సరికాదన్నారు. ఇకనైనా ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు గృహ నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించి ఎక్కువ పెండింగ్లో ఉన్న లేఅవుట్లలో లబ్ధిదారులు, ఇంజనీరింగ్ సహాయకులతో సమావేశాలు నిర్వహించి ఈనెల 22వ తేదీలోగా 910 గృహాలు పూర్తిచేసేలా వారిని ప్రోత్సహించాలన్నారు. అదనపు ఆర్థిక సహాయం ఎస్టీలకు 75,000, బి సి. ఎస్ సి లకు 50వేల రూపాయలు ప్రభుత్వం అందిస్తున్నప్పటికీ సరైన పురోగతి లేకపోవడం విచారకరమన్నారు. జిల్లాకు 13 కోట్ల రూపాయలు అదనపు ఆర్థిక సహాయం కింద నిధులు విడుదలైనప్పటికీ ఇప్పటివరకు కేవలం 72 లక్షల రూపాయలు మాత్రమే వినియోగించుకోవడం జరిగిందన్నారు. క్షేత్రస్థాయిలో చాలామంది ఎంపీడీవోలు మున్సిపల్ కమిషనర్లు వారి పరిధిలోని ఇంజనీరింగ్ సహాయకులతో సమీక్షలు సరిగా నిర్వహించలేదని, 80 శాతం మంది ఇంజనీరింగ్ సహాయకులు ఏమి పనిచేయడం లేదని తెలుస్తుందని, అందువల్లనే సరైన పురోగతి సాధించ లేదన్నారు.

Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com